
# తెలుసుకొనర సఖుడా! | కథ



అత్తవిల్లి బాలసుబ్రహ్మణ్యం

మా పరమేశ్వర్ మీకు తెలుసనుకుంటాను. ఊహూ, తెలియదా? అదేంటి సార్, అలా ముఖం పెట్టారు? వాడు నిజంగానే మీకు తెలియదా? ఆశ్చర్యమేనే! ఊళ్లో వాడి నెరగని వాళ్లు లేరా- అంటే లేరు మరి! ముఖ్యంగా ఊరి ఆడ జనాభాకి వాడు బాగా ఫేమస్!

అదిగో, ఫేమస్సంటే హీరోలా కాదు లెండి; మంచి అసలే కాదు! నూటికి తొంభైమంది-ఊఁహూ అంత కంటే ఎక్కువే -తొంభై తొమ్మది మంది ఆడాళ్లు వాడి పేరెత్తితేనే వదలకుండా అదే పనిగా శాపనార్ధాలు లంకించుకుంటారు-అది కూడా ఇలా అలా కాదు సుమండీ-కాస్త ఘోరంగానే వుంటాయా పరుషోక్తులు!

మచ్చుకి: 'నీ చేతులు పడిపోనూ!' 'నీ కాళ్లు రెండూ నడవ డానికి పనికిరాకుండా పోనూ!' 'నీ చెవు[్రెండూ చాటలవ్వా!' (చెఁవుడు రానూ) 'నీకు శ్రాద్ధం పెట్టా!' 'అరె నీ పిండం పిశాచాలకి పెట్టా!'- మొదలైనవి కొన్ని మాత్రమే!

అయితే ఎక్కువమంది అతివలు వాడి కళ్లనూ, నోటినీ ఎక్కువగా ఉటంకిస్తూ, తమ శాపనార్ధాలను వదులుతారు; 'నీ చూపు తగలడా, భ్రాష్టుడా!' 'ఆ దేవుడన్నవాడు నిజంగా ఉంటే నీ నోరు పర్మనెంట్‌గా పడిపోనో!' 'నీ జిమ్మడా, దరిద్రుడా!'- ఎట్సెట్రా, ఎటెట్రా.

'కొంచెం, ఆగాగు! ఏమిటి సొద? ఆడజనాలేంటి, మీ పరమేశ్వర్ని చూడగానే తిట్లపురాణం విప్పడమేమిటి? ఎందుకీ అయోమయం? ఏల ఈ సస్పెన్స్ మాకు?' అన్చెప్పి మీరంతా నా మీద ఈ పాటికే విసుక్కుంటూవుంటారు లెండి, నాకు బాగా తెలుసు! వస్తున్నా-ఆ వివరాల్లోకే వస్తున్నా! విని తరించండిక!

నేను (నా పేరు శబరీష్ లెండి), పరమేశ్వర్ ఆ ఊర్లో-పక్క పక్క ఇళ్లవాళ్లం కాకపోయినా, ఒకే వీధిలో ఇల్లు (ఇల్లులు అనకూడదుగా) గలవాళ్లం.

చిన్నప్పట్నుంచీ-అంటే, నాకు ఊహ (వాడిక్కూడా) తెలిసిన ప్పట్నుంచీ బహానేస్తులం! అలాగనీ, మరీ ఒకే కంచంలో తిని, ఒకే మంచమ్మీద మేము నిద్రలు తీయకపోయినా- మంచి స్నేహి తులమే నన్నమాట!

చిన్నతనంలోనైతే-మా అమ్మనాకు తినమనిచ్చే జంతికలు, చేగోడీలు, స్వీట్లూ మొదలైనవి, వాడికి రవాణా చేస్తే, వాళ్లమ్మ వాడికిచ్చే బిస్కత్తులు, కేకులూ, పండ్లూ, మున్నగునవి నాకు పంపిణీ చేస్తే గాని వాడికి (నాక్కూడా) తోచేది కాదు. అలా ఇద్దరూ ఆ తినుబండారాలు పరస్పరం మార్చుకుంటూ, ఎక్కడో కూర్చుని బాతాఖానీ వేసుకుంటూ-ఆరగించేవాళ్లమన్నమాట!

ఈ ఇచ్చి పుచ్చుకోడాలు, ఇంకా క్లాసు పుస్తకాలు, నోట్సు పుస్తకాలు వరకే కాకుండా-దీపావళి క్రాకర్సు విషయంలో కూడా జరిగేది-వాడు చిచ్చుబుడ్లూ, తూనీగలూ నాకిస్తే, మతాబులూ, జువ్వలూ వాడికిచ్చేవాడిని; ఇద్దరం కలిసి, గంతులతో, కేరింత లతో-ఆహ్లాదంగా దీపావళి పండుగని ఆనందించేవాళ్లం. మిగతా పండుగలూ అంతే-ఇద్దరం కలిసే, మహోల్లాసంగా జరుపుకునే వాళ్లం.

చిన్నప్పుడు చందమామ, బాలమిత్ర కథలు కూలంకషంగా చదివి, వాటి గురించి చర్చించుకుంటుండేవాళ్లం. కాలేజీల్లో చేరి నాక- వివిధపత్రికల్లో, మేగజైన్లలో వచ్చే కథలూ, సీరియల్సూ ఆమూలాగ్రంగా చదివి, వాటి మంచిచెడ్డల గురించి-వాదించు కునేవాళ్లం.

ఇక నవలలూ, సినిమాలూ, టీవీ కార్యక్రమాల మీద డిస్కషన్స్-రోజువారీ కార్యక్రమాలే! పోతే, కాలేజీలో కొలీగ్స్ పైన, లెక్చరర్ల మీద, ఫంక్షన్లు, స్పోర్ట్స్ గురించి చర్చలు- చెప్పేదే

మండి-రోజా వుండేవే కదా!

ఇక్కడిదాకా, ఇప్పటిదాకా-బాగానే వుంది; అంతా సవ్యంగానే వుందంటారా? ఆగండాగండి, కొంచెం తొందరపడకండి సార్-ఇప్పుడే అసలు కథ మొదలు కాబోతోంది!

అసలు-ఎప్పుడూ క్లాసులో తెలివైన, మంచి మార్కుల స్కోరింగ్ స్టుడెంట్‌గా, బుద్ధిమంతుడుగా పేరుతెచ్చుకున్న మా పర మేశ్వర్-ఉన్నట్టుండి రూటు మారి, అందరి నోళ్లలో (చెడ్డోడిగా) పడిన వైనం బెట్టిదనగా...

మాది కో-ఎడ్యుకేషన్ కాలేజీయేమో-అబ్బాయిలతో పాటుగా అమ్మాయిలూ వుండేవాళ్లు మరి! ఎప్పుడూ అమ్మాయిల పూసే పట్టించుకోని పరమేశ్వర్, ఆ రోజు క్లాసులో, అర్చన అనే అమ్మాయి తన సీటు పక్కనుంచీ పోతుంటే-"డియర్ అర్చనా! మదిలో అంతా నీ చర్చేనే!" అన్నాడు అకస్మాత్తుగా.

"నాకు మాటిచ్చాడే గాని పరమేశ్వర్-ఆ మర్నాటి నుండే కాదు కదా, నేటి దాకా తన నోటి దురదని ఆపుకోలేకపోయాడు. కాలేజీలో అందంగా, ఆకర్షణీయంగా వున్న ఏ ఆడపిల్లా-వాడి కామెంట్ల బారి నుండీ, కవితల దాడీ నుండి తప్పించుకోలేదంటే నమ్మండి! అయితే, తొందర్లోనే గర్ల్స్ స్టూడెంట్స్‌కి తమని కామెంట్ చేస్తూ, అశుధారగా ప్రణయ కవితలను రువ్వుతున్నదెవరో తెలిసిపోయింది. ఒకరిద్దరు ప్రిన్సిపాల్ కి కంప్లైంట్ ఇచ్చారు కూడా!"

అర్చన ఆసాంతం నిర్ఘాంతపోయి, వెనుదిరిగి చూసింది. కాని కామెంట్ చేసింది వీడేనని పోల్చుకోలేకపోయింది. ఎందుకంటే- వీడు అపరశ్రద్ధావతారంలా-పుస్తకంలోనికి తల దూర్చి, పురుగులా అక్షరాలు దొలిచేస్తున్నాడు మరి!

ఇంకోసారి-అప్పుడే క్లాస్ రూమ్‌లోకి అడుగుపెడ్తున్న మోనిక అనే అమ్మాయిని చూస్తూ, తన పక్కనుంచీ పాసవుతూన్నప్పుడు- "ఒక్కసారి ఒప్పుకోవే మోనికా, నీకెలాంటి లోటు రానీయనే నేనికా-" అన్నాడు.

మోనిక వెనుదిరిగి చూసింది. కాని అమాయకంగా, శుద్ధ బుద్ధావతారంలా వున్న వీడిని కనుగొనలేకపోయింది. మరి వీడి బ్యాక్ గ్రౌండ్ కూడా-మెరిట్ స్టుటెండ్‌గా అప్పటికి మెరుగ్గానే వుంది మరి!

అది మొదలు-వాడిలో నిద్రావస్థలో ఇన్నాళ్లూ దాగివున్న భావకవి- వొళ్లు విరుచుకుంటూ, నూతనోత్తేజంతో నిద్ర లేచాడు. ఇక కాలేజీ అమ్మాయిల మీద-ముఖ్యంగా సౌందర్యవతుల మీద- వాడి నోటి వెంట కవితాఝురి ఉప్పెనలా ఎగిసి, ఉరికేది. ఈ విధంగా మా కాలేజీలో అమ్మాయిలకు అవస్థలు ఆరంభమ య్యాయి.

నేను ఊరుకోలేదు. ఆ రోజు కాలేజీ ముగిసినాక, దారిలో వాడిని పట్టుకొని, నిలదీశాను. "ఏవిట్రోయ్, వున్నట్టుండి హీరో అయిపోయావా, ఏమిటి? ఎందుకురా ఆడపిల్లల మీద అర్థం పర్థం లేని కామెంట్స్ మొదలెట్టావ్? నీకసలు ఏ పాటైనా బుద్ధుందా? సిగ్గూ, శరం లాంటివేమైనా ఏడిశాయా అసలు? ఇంతకీ నిన్ను గురించి నువ్వేమనుకుంటున్నావ్? అపరమన్మథుడివనా? భీమ బలుడివనా? దక్షిణనాయకుడివనా? అసలేముందిరా నీ మనసు లో? సడెన్‌గా నీకేమైంది, పిచ్చికుక్క గాని కరవలేదు కదా? నా మాట వినకపోయావంటే మట్టికొట్టుకుపోతావురోయ్! నువ్వు మారక పోతే మనస్నేహాని కింతటితో రాం, రాం!" నా శాయశక్తులా వీర దులుపుడు దులిపాను.

పరమేశ్వర్ చెక్కు చెదరని చిరునవ్వుతో నే నుడివిన సుద్దు లన్నీ విన్నాడు. వాడికి రవ్వంతైనా కోపం అస్సలు రాలేదంటే నమ్మండి! అఫ్కోర్స్, ఆ సంగతి నాకు తెలుసనుకోండి. మేమిద్దరం చిన్నప్పట్నుండీ దోస్తులం కదా-అందుకే నేను గట్టిగా నాలుగు కేకలేసినా, వాడు ఇసుమంతైనా 'ఫీల'వడన్న సంగతి నాకెరుకే! కాకపోతే, నా సలహాలు వాడెంతవరకూ-మన్నిస్తాడో, ఆచరిస్తాడో, ఆమోదిస్తాడో చూడాలి!

"నీ లెక్చర్ పూర్తయినట్టేగా?" నవ్వుతూ నా ముఖంలోకి చూస్తూ అన్నాడు. "ఒరేయ్, శబరీ! మనమిన్నాళ్లూ ఎంత ఎంజాయ్‌మెంట్ మిస్సయ్యామో నాకు ఈ మధ్యనే తెలిసొచ్చింది రా! నిన్న డివిడీలో మంచి లవ్ బేస్‌డ్ పిక్చర్ చూశానురా! నిజంగానొరేయ్, ఈ ఆడవాళ్లు అర్థం కాని నవలల్లాంటోళ్లురా! వాళ్లనెప్పుడూ చదువుతూనేవుండాలి, చూస్తూనేవుండాలి, ఆరాధిస్తూనేవుండాలి, ఆస్వాదిస్తూనేవుండాలి, అభిమానిస్తూనే వుం డాలి..."

"...వాళ్ల చేతుల్లో చావు దెబ్బలు తింటుండాలి, చెప్పు దెబ్బలు తింటుండాలి, గూబలు 'గుయ్' మనిపించుకుంటుండాలి, చెంపలు 'ఛెళ్లు'మనిపించుకుంటుండాలి; నీ దురదృష్టం కొద్దీ వాళ్లు ప్రిన్సి పాల్‌కి రిపోర్టిస్తే-సస్పెండవుతుండాలి..." వ్యంగ్యంగా వాడికి రిటార్టిచ్చాను.

కాస్సేపాగి -"ఔనుగానొరేయ్, బుద్ధుడికి సడెన్‌గా, బోధి చెట్టు కింద జ్ఞానోదయమైనట్టుందిరా! నాట్ బ్యాడ్! నువ్వు వాళ్లని ఆరాధించు, ప్రేమించు, వాళ్లకు తోడ్పాటునందించు, వాళ్లని ఉద్ధ రించు-నాకు ఓకే! కాని, ఇండీసెంట్‌గా ఈ కామెంట్సేవిట్రా! నాకు అసలు నచ్చలేదు"- అంటుంటే, నన్నడ్డుకుంటూ, "అదేమిటోరా, వాళ్లని చూడగానే ఇదివరకట్లా ఊరుకోలేకపోతున్నారా-ఏదో నా కొచ్చినది చందోబద్ధంగా అనాలనిపిస్తున్నదిరా! నన్ను నేను ఆ విషయంలో మటుకు కంట్రోలు చేసుకోలేకపోతున్నానురా"- అన్నాడు.

"రేపెవరికేనా నీ మీద అనుమానమొచ్చి, ఇదంతా తెలిసిందో -నీ పని అంగట్లో జాతరేరా, జాగ్రత్త!" అన్నాను.

"ఓకేరా, ఇక రేపట్నుంచీ నా ఫీలింగ్స్ నాలోనే దాచుకుంటూ, కంట్రోల్డ్‌గా వుంటారా. ఎంత అందమైన ఆడపిల్ల కనబడినా, చలించకుండా నా నోరు కట్టేసుకుంటారా. సరేనా?" అన్నాడు నా కేదో ప్రామిస్ చేస్తున్నట్టు.

"దట్స్ లైక్ గుడ్ బాయ్, మై డియర్ ఫ్రెండ్! గుడ్ నైట్!" అంటూ నేను, మా ఇంటి వైపు నడిచాను.

నాకు మాటిచ్చాడే గాని పరమేశ్వర్-ఆ మర్నాటి నుండే కాదు కదా, నేటి దాకా తన నోటి దురదని ఆపుకోలేకపోయాడు. కాలేజీలో అందంగా, ఆకర్షణీయంగా వున్న ఏ ఆడపిల్లా-వాడి కామెంట్ల బారి నుండీ, కవితల దాడీ నుండి తప్పించుకోలేదంటే నమ్మండి!

అయితే, తొందర్లోనే గర్ల్స్ స్టూడెంట్స్‌కి, తమని కామెంట్ చేస్తూ, అశుధారగా ప్రణయకవితలను రువ్వుతున్నదెవరో తెలిసిపోయింది. ఒకరిద్దరు ప్రిన్సిపాల్‌కి కంప్లైంట్ ఇచ్చారు కూడా!

కాకపోతే, వాడి మెరిటే వాడిని కాపాడింది. ప్రిన్సిపాల్‌గారు పిలిచి, వాడికి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు, "మిస్టర్ పరమేశ్వర్! ఇక మీదట ఇంకోసారి ఏ ఆడపిల్లైనా నీ మీద రిపోర్టు చేసిందో, నేనేం చేస్తానో ఇప్పుడు చెప్పను, కాని దాని ఫలితం పరమదారుణంగా వుంటుంది. నువ్వు అది ఊహించలేనంతగా అనుభవిస్తావ్! ఇదే నీకు నా ఫస్ట్ అండ్ ఫైనల్ వార్నింగ్!! ఇప్పుడేనా నిన్నెందుకు వది లేస్తున్నానో తెలుసా? నువ్వు క్లాసులో మెరిట్ స్టూడెంట్‌వి, ఫస్టు



ర్యాంక్ తెచ్చేట్టు వున్నావ్ - అందుకని!" అని.

ఆ తర్వాత-వాడు కెరీర్ ఆలోచించి మానేశాడో, ఇంకేమో గాని- కాలేజీలో గర్ల్స్ పైన కామెంట్స్ మానేశాడు.

అయితే, తిరిగే కాలూ, తిట్టే నోరూ ఊరుకోవంటారు కదా! కాలేజీలో మానేసిన అలవాటు బయట మొదలెట్టాడు. వీధిలో కొంచెం అందమైన అతివ కనబడితే చాలు-ఏదో ఒక కామెంట్ లేదా కవిత పాస్ చేసేవాడు. ఆ ఊపులో వాడు-పెళ్లైన పడతుల్నీ వదలలేదు.

త్వరలోనే ఊళ్లో అందరి దృష్టిలోకీ వచ్చాడు. అమ్మాయిల అన్నదమ్ములో, తండ్రులో, బావలో, మేనమామలో-వీడిని తన్నడానికి ఎన్నోసార్లు తయారయ్యారు. 'చావు తప్పి కన్ను లొట్ట బోయిన'ట్టయింది వాడికి, పలు సందర్భాల్లో. మాగ్జిమమ్ టైమ్స్ నేను అమ్మాయిల తరపున వచ్చినవాళ్లతో మాట్లాడి, వాళ్లను శాంతింపజేసేవాడిని. చిన్ననాటి చెలికాడు కదా-నాకు తప్పుతుందా? 'మిస్సమ్మ' స్టయిల్లో 'తెలుసుకోరా, సఖుడా!' అని ఎన్నిసార్లని వాడికి సుద్దులు చెప్పివుంటాను, నాది వృథా ప్రయాసే అయ్యేది!

మా వూళ్లో 'లవర్స్ పార్క్' (నిజానికి దాని పేరు చాచానెహ్రూ పార్క్) ఎదురుగా ఒక చెరువుంది. దానికటు వైపు రామలింగేశ్వరాలయం వుండడం చేత-ఆ తటాకాన్ని 'రామలింగ చెరువ'ని పిలుస్తారు. చెరువు గట్టు పొడవునా జనం కూర్చోడానికి సిమెంటు సోఫాలూ, గద్దెలూ వుండేవి. సాయంకాలం ఐదైనదాదిగా-కుర్రకారంతా (అంటే-వయస్సు పైబడినవాళ్లూ, స్త్రీలూ రారని కాదు సుమండీ) చెరువు గట్టు పైకి చేరేవారు.

కాలేజీకి సెలవులిచ్చేయడంతో, మేము కూడా సాయంత్రాలు అక్కడికి చేరుకుని-చెరువు పైనుండి వీచే చల్లగాలుల్నీ, పార్కుకీ, చెరువుకీ మధ్యగా పోయే రోడ్ మీద వెళ్లే పిల్లగాలుల్నీ-ఆ సిమెంట్ సోఫాలపైన కూర్చొని ఆస్వాదించేవాళ్లం.

మరి, అటువంటి సిచువేషన్లో పరమేశ్వర్ సైలెంట్‌గా వుంటాడా? డౌట్ అక్కర్లేదు-చల్లగాలికి వీడు కూడా వీరోచితంగా విజృంభించి-రోడ్ మీద పోయే అంగనలని ఏ ఒక్కర్నీ 'విత్‌ఔట్ కామెంట్' విడిచిపెట్టేవాడు కాదు! తెలుగులో, హిందీలో హిట్టయిన ఎన్నో చిలిపి, శృంగార, అల్లరి గీతాల పల్లవులు-వాడి పెదవులపై నుండి అలవోకగా జాలువారేవి! మన ఆడవాళ్లు (అంటే మన తెలుగు ఆడపడుచులని అర్థం చేసుకుంటారని తెలుసు) స్వతహాగా శాంతస్వభావలు కనుక, చాలామంది ఏమీ పట్టించుకోకుండా నిశ్శబ్దంగా, నిర్వికారంగా వెళ్లేవాళ్లు. కొంతమంది మటుకు ఆగి, వాడిని శాపనార్థాలు పెట్టేవాళ్లు; ఇంకొంతమంది వాడిని మించి 'అమ్మనా బూతులు' తిట్ల వర్షంలో కురిపించి మరీ పోయేవాళ్లు!

మనవాడు మటుకు ఏదేమి జరిగినా-షరా మామూలు! మొదట అవాక్కయినా, తర్వాత తేరుకొని, తిరిగి ద్విగుణోత్సాహంతో తన 'కామెంట్స్ వరల్డ్'లో మునిగి తేలేవాడు.

ఆ రోజు సాయంకాలం ఆరవుతూంది. అప్పుడే పరమేశ్వర్, నేనూ, పార్క్ ఎదురుగా, రామలింగ చెరువు గట్టు మీద కట్టిన రాతి సోఫాల వెనక వున్న గట్లపై ఆసీనులమై, చెరువు పైనుండి వీస్తున్న చల్లగాలి తెమ్మెరల నాస్వాదిస్తున్నాం. వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. చల్లని పిల్లగాలులకు తోడు, ఎదురుగా వున్న పార్కు రేడియోలో నుండి రొమాంటిక్ హీరో రాజ్‌కపూర్ సినిమాలో దేదో మాంచి ప్రేమగీతం వినిపిస్తూంది. ఎదలు పులకిస్తున్నాయి.

అప్పుడే నా దృష్టి, మాకెదురుగా రోడ్డు పైనుండి వస్తున్న ఇద్దరు స్త్రీల మీద పడింది. వారిలో పెద్దావిడకి ముప్ఫయ్యేళ్లుం టాయ్, చిన్నామెకు ఇరవై వుండొచ్చేమో!

ఇద్దరూ చక్కగా, తెల్లటి మేనిచాయలతో, అందంగా వున్నారు. ఆధునికంగానూ వున్నారు. కమ్మటి పౌడరు వాసనా, ఖరీదైన స్ప్రే గుబాళింపూ-అక్కడున్న అందర్నీ రససామ్రాజ్యంలో ముంచెత్తి, అలరించింది. దాదాపు అక్కడున్నవాళ్లంతా- ఆ అతివలనే కుతూహలంతో చూస్తుండడం, ఎందుకో పరమేశ్వర్‌కి నచ్చలేదు!

ఈ లోగా వాళ్లిద్దరూ మాకు కొంచెం దగ్గరగా వచ్చారు. వెంటనే నేను, వాళ్ల చేతుల్లో వున్న క్యారీ బ్యాగ్‌లకేసి చూస్తూ " మీ అందాల చేతులు కందేను పాపం"-అంటూ ఓ పాతసినిమా పాట ఆలపించనారంభించాను.

పరమేశ్వర్ నాకేసి అదోలా చూశాడు. నేను అది పట్టించుకోకుండా వాళ్లనే చూస్తూ "బృందావనమది అందరిదీ, గోవిందుడు అందరి వాడేలే-" అంటూ పాడుతున్నాను.

"ఒరేయ్, శబరీ! నువ్వేం చేస్తున్నావో నీకు తెలుసా?" అంటూ పరమేశ్వర్ నా నోటి మీద తన చేతులుంచబోయాడు.

నేను వాడి చేతుల్ని విదిలించుకుంటూ, "నిలువవే వాలు కనులదానా, వయ్యారి హంస నడక దానా-"అంటూ చిన్నమ్మాయిని చూస్తూ పాటలంకించుకున్నాను.

ఆ అతివలిద్దరూ నన్ను వదిలేసి, పరమేశ్వర్ని మాత్రం తినేసేలా చూశారు. వాడు తల దించుకున్నాడు. వాళ్లు వెళ్లినాక, వాడు నాకు మాట కూడా చెప్పకుండా అక్కడ్నుంచీ జారుకున్నాడు.

అంతే కాదు! ఆ తర్వాత ఇంచుమించు ఓ నెల రోజులు నాతో మాట్లాడనేలేదు వాడు!!

ఆశ్చర్యంగా-ఆ తర్వాత నుండి వాడి ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. ఆడవాళ్ల మీద కామెంట్లూ, కవితలూ, పూర్తిగా మానేశాడు.

వాడిలో-హఠాత్తుగా వచ్చిన ఈ మార్పుకి కారణం, ఆ రోజు చెరువు గట్టు మీద నేను కామెంట్ చేసిన స్త్రీలిద్దరూ-వాడికి స్వయానా అక్కా, చెల్లెలూ కావడం!

అయితే, ముందు రోజు వాడికి తెలియకుండా వాళ్లని కలిసి, వాడి చెడు అలవాటు గురించి చెప్పి, అది మాన్పించేందుకు నేను వాళ్ల సహకారం కోరడం, అందుకే వాళ్లిద్దరూ ఆ రోజు అక్కడికి, ఆ టైములో రావడం-వాడికిప్పటికీ తెలియదు! మీరూ చెప్పకండేం?